ప్రజల ఆనందమే అభివృద్ధి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 4 వార్డుల పరిధిలో రూ.177 కోట్ల 'ఆసరా' సాయం



పీఎం పాలెంలో లబ్ధిదారులకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అభివృద్ధి అంటే అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండడమేనని, వారి ఆనందం కోసమే నిత్యం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తపిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పీఎంపాలెంలోని అవంతి పంక్షన్ హాలులో బుధవారం నిర్వహించిన సభలో లబ్ధిదారులకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భారీ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏ ఆసరా లేని వారికి కూడు, గూడు, నీడ కల్పించడమే సీఎం జగన్ లక్ష్యం అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో 31 లక్షలు మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. విశాఖలో 1.50 లక్షల మందికి ఇచ్చారన్నారు. ఈ ప్రభుత్వం ద్వారా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలకుపైనే లబ్ధి చేకూరుతుందని, కొందరికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరినట్టు చెప్పారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చేస్తాడని, మహిళలకు నెక్లెస్, కాసులు పేర్లు ఇచ్చేస్తానని చెపుతాడన్నారు. ఆయన హయాంలో ఒక్క సెంటు స్థలం కూడా పేదలకు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు హామీలు ఎవ్వరూ నమ్మవద్దని కోరారు.



సభకు తరలివచ్చిన మహిళలు

4 వార్డుల్లో రూ.177 కోట్ల లబ్ధి

జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డుల్లోని లబ్ధిదారులకు రూ.177 కోట్లు ఆసరా నిధులు వచ్చాయని, ఈ ఏడాది ఇక్కడ 1401 గ్రూపులకు చెందిన 14013 మంది డ్వాక్రా మహిళలకు ఆసరా నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఆసరా నిధులు, అమ్మ ఒడి, ఇళ్ల పట్టాలు మహిళల పేరునే ఇస్తున్నారన్నారు. రాబందులు, గుంట నక్కల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని ప్రతిపక్షాలును ఉద్దేశించి అన్నారు. కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జెడ్పీ కనక మహాలక్ష్మి, ఏపీడీ గంగాధర్, వైఎస్సార్‌సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వంకాయల మారుతీప్రసాద్, పిళ్లా సూరిబాబు, పీకేఎం పాత్రుడు, సియాద్రి కనకరాజు, పోతిన ఎల్లాజీ, పోతిన ప్రసాద్, వరలక్ష్మి, సూరిబాబు, శివ, అప్పారావు, అల్తాఫ, జహనార, పిళ్లా రమణ, రవి, అప్పన్న, బాబ్జి, లక్ష్మణ, సంజీవ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో అతివలకు భరోసా

కొమ్మాది: మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని, అతివలకు వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక భరోసా లభిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టులో వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్డులోని 341 స్వయం సహాయక సంఘాల్లోని 3,925 మంది మహిళా సభ్యులకు రూ.10,34,77,114 కోట్లతో భరోసా లభిస్తుందన్నారు. మహిళలను మహారాణులుగా తీర్చిదిద్దిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. రాజకీయంలోనూ, సంక్షేమ పథకాల అమలులోనూ మహిళలకే పెద్ద పీట వేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఉన్నా, లేకపోయినా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయా..? లేదా..? వారికి ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని నిత్యం ప్రజల్లో ఉండే ప్రభుత్వం తమదన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండా అని, ప్రతిపక్షాలు పంచతంత్ర కూటమితో వచ్చినా మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, స్థానిక నాయకులు బోర రామకృష్ణ, జె.అప్పారావు, మేరుగు చిన్నారావు, వేముల ఈశ్వర్‌రెడ్డి, మరుపల్లి చిన్నారావు, నాగోతి సింగన్న, వాండ్రాసి సన్యాసిరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రమతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న సురేష్ కుమార్

ఆనందపురం : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి విద్యార్థులు శ్రమించాలని వృక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు కాకర సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని వెల్లంకి ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదివి పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతే పునాది అని, మంచి ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి తర్వాత లభించే కోర్సులు, ఉపాధి అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఫౌండేషన్ సభ్యులు సాడి శంకర్, కిరణ్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దివీస్ నిధులతో ఆర్వో ప్లాంట్ నిర్మాణం



ఆర్వో ప్లాంటు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంవీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న రవాణా శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి దివీస్ సంస్థ నిధులు మంజూరు చేసిందని ఎంవీ ఇన్‌స్పెక్టర్ బి.బాలాజీ చెప్పారు. బుధవారం ఆయన ఆర్వో ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 రోజుల్లో పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. దీంతో రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే వారికి సురక్షిత నీటిని అందించే అవకాశం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు ప్రవీణ్ కుమార్, శ్రీనివాసరావు, రాజారావు, మాధవి, శిరీషాదేవి, దివీస్ అధికారులు విజయ్ భాస్కర్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకోవాలి



పద్మనాభం హైస్కూల్‌లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: విద్యార్థులు ట్యాబులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు సూచించారు. పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎనిమిదో తరగతి విద్యార్థులు 68 మందికి వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభంతో కలిసి ఆయన ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ట్యాబులతో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, గంగిరెడ్ల పద్మనాభస్వామి, హెచ్‌ఎం ఎ.బాలామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూటీ చోరీ

తగరపువలస: సంగివలస అనిట్స్ కళాశాల వద్ద పార్కింగ్ చేసిన ఏపీ 31 ఈవీ 5299 నంబరు గల స్కూటీ బుధవారం చోరీకి గురయింది. జీవీఎంసీ ఒకటో వార్డు గాంధీ బొమ్మ వీధికి చెందిన తమ్మిన రాముకు చెందిన వాహనాన్ని ఆయన బంధువు అనిట్స్ ఇంజినీరింగ్ విద్యార్థి రాజగిరి వెంకటేష్ కళాశాలకు తీసుకెళ్లాడు. పార్కింగ్ చేసిన వాహనం కళాశాల బయటకు వచ్చిన తర్వాత కనిపించలేదు. దీంతో బాధితుడు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వాహనం వివరాలు తెలిస్తే 70364 02249లో తెలపాలని కోరాడు.

ఎలక్ట్రికల్ రంగానిదే భవిష్యత్



ఎలక్ట్రికల్ వాహనాన్ని పరిశీలిస్తున్న ఏయూ ఇన్నోవేషన్ కౌన్సిల్ సీఈవో రవి ఈశ్వరపు

ఆనందపురం : రాబోయే కాలమంతా ఎలక్ట్రికల్ రంగంపైనే ఆధారపడి ఉంటుందని, అందు కోసం ఇంజినీర్లను ఇప్పటి నుంచే సమాయత్తం చేయాలని ఏయూ ఇన్నోవేషన్ కౌన్సిల్ సీఈవో రవి ఈశ్వరపు సూచించారు. మండలంలోని శొంఠ్యాంలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో 'సెంటర్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్ టెక్నాలజీ ఇండస్ట్రీ – 4.0' పేరుతో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్ట్రికల్ రంగాన్ని విస్తృత పరచడానికి ఎంతో మంది నైపుణ్యం గల ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ అవసరమన్నారు. కళాశాలలో వృత్తి నైపుణ్యాలు పెంపొందించడానికి ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల భాగస్వామ్యంతోనే ఉత్తమ ఇంజినీర్లను అందించగలరని చెప్పారు. విహాన్ ఎలక్ట్రికల్ సంస్థ సీఈవో వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించినాడే ఫలితం ఉంటుందని, ఆ దిశగా విద్యాసంస్థలు కృషి చేయాలని కోరారు. ప్రాక్టికల్‌గా పారిశ్రామిక శిక్షణను అందించడానికి కళాశాలలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ రకాల ఎలక్ట్రికల్ వాహనాలను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్.సత్యనారాయణరాజు, కార్యదర్శి ప్రసాదరాజు, ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్, డైరెక్టర్ మురుగుదాసు, ఎలక్ట్రికల్ విభాగాధిపతి ఆర్ఎస్ఆర్ కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల ప్రగతికి ఆకాశమే హద్దు



మానవహారంగా ఏర్పడిన బాలికలు

పద్మనాభం : ఆడపిల్లల ప్రగతికి ఆకాశమే హద్దని కస్తూర్బా విద్యాలయం స్పెషలాఫీసర్ గ్రేస్ లిల్లీ అన్నారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేస్ లిల్లీ మాట్లాడుతూ బాలికల ఆలోచన పదునుగా ఉండాలని, ప్రతి బాలిక తనకు తానే ఒక ఆయుధంగా మారాలని సూచించారు. నేర్చుకునే ప్రతి అక్షరాన్ని పదునుగా మలచుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. బాలికల హక్కులను వివరించారు. ఈ సందర్భంగా తమ హక్కులను కాపాడుకుంటామని బాలికలు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో సీఆర్టీలు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో రాజ్ తరుణ్, హైపర్ ఆది సందడి



బీచ్ రోడ్డులో స్కూటీపై వెళ్తున్న రాజ్ తరుణ్, హైపర్ ఆది

కొమ్మాది: బీచ్ రోడ్డులో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నటుడు రాజ్ తరుణ్, నటి మనీషా కందూర్ నటిస్తున్న భలే ఉన్నాడే సినిమా చిత్రీకరణలో భాగంగా మంగమారిపేట బీచ్ నుంచి ఆర్‌కే బీచ్ వరకు స్కూటీపై నటులు రాజ్ తరుణ్, హైపర్ ఆది ప్రయాణించే సన్నివేశాలు చిత్రీకరించారు. అనుకోకుండా స్కూటీపై వీరు వెళ్లడంతో పలువురు ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. రవికిరణ్ ఆర్ట్స్ పతాకంపై ఎస్.వి.కిరణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైన్‌మెంట్ కథాంశంతో కూడినదని, హీరో రాజ్ తరుణ్ న్యూలుక్‌లో కనిపించబోతున్నారని దర్శకుడు జె.శివసాయి వర్ధన్ తెలిపారు.

ఐకేఎస్‌తో గీతం ఎంవోయూ



ఒప్పందం కుదుర్చున్న సంస్థల ప్రతినిధులు

కొమ్మాది: అమెరికాకు చెందిన ఐకేఎస్ హెల్త్ కేర్ సంస్థ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ఐకేఎస్ సంస్థ ఉపాధ్యక్షురాలు డాక్టర్ హరిప్రీతికౌర్ అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఒప్పందంలో భాగంగా వైద్య రంగంలో ఫిజియోథెరపీ, దంత వైద్యం, పారా మెడికల్ విభాగాల్లో యువతకు మార్గదర్శకం వహించడంతోపాటు అమెరికన్ వైద్య నిపుణుల సూచనలు, సలహాలు అందిస్తూ వృత్తి నైపుణ్యాలు పెంచడంలో క్రియాశీల పాత్ర పోషిస్తారు.

డివైడర్ల పైకి దూసుకుపోయిన కార్లు



మధురవాడ పనోరమ హిల్స్ వద్ద డివైడర్ పైకి దూసుకుపోయిన కారు



పీఎంపాలెం బేతని చర్చి వద్ద డివైడర్‌పై కారు

మధురవాడ: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల కార్లు డివైడర్లపైకి దూసుకుపోయాయి. ఒక చోట మద్యం మత్తులో, మరోచోట అతివేగంతో కారు నడిపి డ్రైవర్లు డివైడర్లు ఎక్కించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం పీఎం పాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డులో బేతని చర్చి వద్ద అతివేగంతో కారు నడిపి ఓ వ్యక్తి డివైడర్ ఎక్కించారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సాయంత్రం పనోరమ హిల్స్ సమీపంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడుపుతూ డివైడర్ ఎక్కించినట్టు పోలీసులు తెలిపారు. అయితే ఇక్కడ కారు, గ్రిల్స్ కూడా ధ్వంసమయ్యాయి. వాహనదారుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

'ఎన్ఎంఎంఎస్'కు ముగ్గురు ఎంపిక

తగరపువలస: ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ మెరిట్ కమ్ స్కాలర్‌షిప్ పరీక్షలో సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 8వ తరగతి చదువుతున్న అపురూప, రాజ్ సాత్విక్, పల్లవి ఉన్నారు. వీరికి నాలుగేళ్లపాటు రూ.12వేలు వంతున కేంద్ర ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ అందుతుంది. వీరిని ప్రధానోపాధ్యాయుడు వై.జగన్నాథస్వామి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ వినియోగదారుడికి పరిహారం

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెంకి చెందిన బి.అప్పారావు రెడ్డి అనే విద్యుత్ వినియోగదారుడికి ఒక్కచోట కేటాయించాల్సిన విద్యుత్ కనెక్షన్ వేరే చోట వేసినట్టు నిర్ధారణ కావడంతో అతనికి పరిహారం చెల్లించాలని విశాఖపట్నం డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ఫోరమ్ కమిషన్ – 1 ఆదేశించినట్టు బాధితులు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులకు 2019లో బి.అప్పారావు రెడ్డి కనెక్షన్ కోసం దరఖాస్తు చేశారు. ఆయన కోరిన చోట కాకుండా వేరోచోట అధికారులు కరెంటు కనెక్షన్ ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. దీనిపై అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. పైగా వారు కోరిన చోటే ఇచ్చామంటూ బుకాయించారు. దీంతో 2022లో సదరు వ్యక్తి కన్స్యూమర్ ఫోరంను ఆశ్రయించారు. ఈ మేరకు విశాఖపట్నం డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ ఫోరం కమిషన్ – 1 వారు సేవా లోపం కింద బాధితుడుకి విద్యుత్ శాఖ వడ్డీతో సహా కరెంటు కోసం చెల్లించిన డబ్బులు, లిటిగేషన్ ఖర్చులు పరిహారంగా చెల్లించాలని ఆదేశించినట్టు వారు చెప్పారు.

యూజీసీ నెట్ పరీక్షలో మజ్జిపేట ఉపాధ్యాయునికి ఫస్ట్ ర్యాంక్

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు ముగదాల అప్పలరాజుకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2023 – 2024 ప్రవేశ పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ లభించింది. ఇతనికి 300 మార్కులకు 238 లభించాయి. చిట్టివలస కార్మికవాడకు చెందిన అప్పలరాజు తగరపువలసలో ఫర్ యువర్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు. ఆర్థిక సమస్యల కారణంగా ఫీజులు చెల్లించుకోలేని, పుస్తకాలు కొనలేని విద్యార్థుల కోసం ఈ సొసైటీ స్థాపించారు. ఈ సందర్భంగా బుధవారం అప్పలరాజును సొసైటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆడుదాం ఆంధ్రాతో యువతకు ప్రోత్సాహం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన యువతీ, యువకులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఇక్కడి వుడా మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ ఎంతో మంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ గతంలో వారిని ఎవరూ ప్రోత్సహించలేదన్నారు. దీంతో వారి ప్రతిభ మరుగునపడిపోయేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. దీనివల్ల ఎంతో మంది యువతీ, యువకులు తమలోని క్రీడా ప్రతిభను ప్రదర్శిస్తూ ఎంతో చక్కగా పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. దీనివల్ల వారు క్రీడల్లో రాణించడంతోపాటు ఎన్నో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఇది వారి జీవితాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు జరుగుతుండగా 60 జట్లు పాల్గొంటున్నాయని, గెలుపొందిన జట్లకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తారని వెల్లడించారు. ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, తహసీల్దార్ రమేష్, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎంపీడీవో డాక్టర్ జానకి, ఇతర అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు పోటీలు



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న మజ్జి వెంకటరావు

ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రతి ఏడాది పోటీలు నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు చెప్పారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మజ్జి అప్పారావు జ్ఞాపకార్థం తర్లువాడలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత నాయకుడు అప్పారావు తన జీవిత కాలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగించడానికి క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని చెప్పారు. టోర్నమెంట్ మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, నాయకులు రౌతు వెంకటరావు, చందక సూరిబాబు, బంక కృష్ణం నాయుడు, బంక ముత్యాలు, గొలగాని కృష్ణ, షిణగం రాంబాబు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ సభకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు

పద్మనాభం: భీమునిపట్నం నియోజకవర్గం పరిధి సంగివలసలో ఈ నెల 27న నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు కోరారు. పద్మనాభం జంక్షన్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం సభకు అధిక సంఖ్యలో ప్రజలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఈర్ల ఈశ్వరరావు, తాలాడ పద్మనాభం, కోరాడ రామేశ్వరరావు, అముజూరి అప్పారావు, బేపల గురునాయుడు, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సర్పంచ్‌లు చందక శ్రీను, పల్లంటి చిన్నారావు, జి.వి.కె.కె.వర్మ, ఎంపీటీసీ సభ్యుడు బి.వి.ఎస్.ఎన్.రాజు, సీర సూరప్పడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చక్కగా చదువుకుంటే ఉద్యోగ అవకాశాలు

భీమునిపట్నం: బాలికలు ఎంత చక్కగా చదువుకుంటే అంత మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం ఇక్కడి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం చదువుకునేందుకు మంచి అవకాశాలున్నాయని, వాటిని వినియోగించుకుంటే మంచి స్థితికి చేరుకుంటారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ తాను చదువుకునే సమయంలో అవకాశాలు తక్కువగా ఉండేవని, ఇప్పుడు అన్నివిధాలుగా అవకాశాలు మెరుగయ్యాయని, ఇది బాలికలకు వరంలాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ సమస్యలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని, అనుకున్నది సాధించుకోవాలని సూచించారు. సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, విద్యాలయం ప్రిన్సిపాల్ గంగా కుమారి పాల్గొన్నారు.

అనాథ మహిళ మృతదేహం ఖననం



చిట్టివలస శ్మశానవాటికకు లక్ష్మి భౌతికకాయం తరలించిన స్థానికులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు గ్రంథాలయ వీధికి చెందిన ఎల్లంరెడ్డి లక్ష్మి అనే వృద్ధురాలు ఏళ్ల తరబడి ఒంటరిగా నివసిస్తోంది. గతంలో ఆమె భర్త చనిపోగా కుమారుడు ఎప్పుడో ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఆమెకు వృద్ధాప్య పెన్షన్ వస్తుండగా భీమిలి సన్ స్కూల్ అధినేత కైతపల్లి శ్రీనివాసరావు ఈమెకు పదేళ్లుగా రెండు పూటలా ఇంటికి భోజనం పంపేవారు. అస్వస్థత కారణంగా బుధవారం వేకువజామున మృతి చెందగా స్థానికులు అంతిమ సంస్కారం చేశారు. తాళ్లవలసకు చెందిన మందపాటి శ్రీనివాసరాజు ఉచితంగా అంతిమయాత్ర వాహనాన్ని సమకూర్చారు. ఈమెను వాహనం డ్రైవర్ ఒనుము కనకరాజు, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు తెడ్లాపు అప్పలరాజు, ఊడికల పైడిరాజు, తమ్మిన శ్రీను, మాదాబత్తుల రాంబాబు గోస్తనీనది తీరాన చిట్టివలస శ్మశానవాటికకు తరలించి ఖననం చేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న ఎంఈవో శివరాణి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం బుధవారం చిట్టివలస జెడ్పీ బాలికల హైస్కూల్, సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూళ్లకు చెందిన 175 మంది పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ మెటీరియల్‌ను భీమిలి ఎంఈవో శివరాణి చేతుల మీదుగా అందించారు. డీసీఈబీ బోర్డు ఆధ్వర్యంలో రూపొందించిన మెటీరియల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.జగన్నాథ స్వామి, సీహెచ్.రోజామణి, దివీస్ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవీఎంసీ ఆస్తుల లీజుకు చురుగ్గా వేలం



మధురవాడ జోనల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న అప్పలరాజు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ, ఆరిలోవ పరిసర ప్రాంతాల్లోని ఆస్తుల లీజుకు వేలం బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా సాగింది. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి పర్యవేక్షణలో సూపరింటెండెంట్ అప్పలరాజు వేలం పాట చేపట్టారు. మధురవాడ డైలీ మార్కెట్, వారపు సంత వేలంకి ముగ్గురు హాజరు కాగా పతివాడ వేణుగోపాలరావు రూ.22,05,000కు దక్కించుకున్నారు. ముడసర్లోవ పార్కు ప్రవేశ రుసుం పాటకు కూడా ముగ్గురు హాజరుకాగా కె.రాంప్రసాద్ రూ.6 లక్షలకు, పార్కింగ్ రుసం వసూలును వి.శ్రీనివాసరావు రూ.1,35,000కి, క్యాంటీన్ నిర్వహణను రూ.62 వేలకు శ్రీనివాసరావు దక్కించుకున్నారు. మధురవాడ జోన్‌లోని మిథిలాపురి వుడా కాలనీ, ముడసర్లోవ పార్కు వద్ద మామిడి, కొబ్బరి చెట్ల ఫలసాయం, మధురవాడ పీవీ నరసింహారావు కళ్యాణ మండపం, ఆరిలోవ లాస్ట్ బస్టాప్ కళ్యాణ మండపం, మారికవలస ఆర్‌జీకే కళ్యాణ మండపం వేలం పాటకు ఎవ్వరూ ఆసక్తి చూపకపోవడంతో వాయిదా వేసినట్టు జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి చెప్పారు.